క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి

వేమూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడు



భట్టిప్రోలు: ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందని వేమూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడు సూచించారు. బుధవారం భట్టిప్రోలు మండలంలోని 48 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వసంతరాయుడు మాట్లాడుతూ ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లేందుకు అనువైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నడవలేని వారికి అనుకూలంగా ఉండేందుకు ర్యాంప్‌లు, తాగునీరు, మరుగుదొడ్ల వసతి ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, ఎలక్షన్ డేటా ఆపరేటర్ రాజేష్, వీఆర్వోలు ఉన్నారు.

మేలు జాతి లేగ దూడల ప్రదర్శన




చావలి(వేమూరు): మేలు జాతి దూడల వల్ల మంచి లాభాలు సాధించవచ్చని తెనాలి డివిజన్ పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ వై కేదారేశ్వర్ రైతులకు సూచించారు. వేమూరు మండలంలోని చావలి పశు సంవర్ధ శాఖ కార్యాలయంలో బుధవారం మేలు జాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలో 76 మంది దూడల యాజమానులు తమ దూడలను ప్రదర్శించారు. సోమరౌతు వెంకయమ్మ, సోమరౌతు రామారావు, గాజుల శ్రీనివాసరావుల దూడలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి, ప్రదర్శనలో పాల్గొన్న రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వేమూరు ఏరియా వెటర్నరీ హాస్పటల్ సహాయ సంచాలకులు డాక్టర్ జనార్ధనరావు, గ్రామ సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు, డాక్టర్ బాలశంకర్, చావలి పశు వైద్యాధికారి చిన మునియ్య, డాక్టర్ కె సుజాత, ఆజాద్, ప్రసాద్, సందీప్, గిరి, మధు, రైతులు పాల్గొన్నారు.

23న మల్లికార్జునేశ్వర స్వామి కల్యాణం



నిజాంపట్నం: భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన బాలా త్రిపుర సుందరీ సహిత శ్రీ మల్లికార్జునేశ్వర స్వామి ఆలయంలో ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ప్రతి ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ తిరునాళ్లను ప్రతి ఏడాది కన్నుల విందుగా నిర్వహిస్తుంటారు. ఈ నెల 23న స్వామివారి కల్యాణాన్ని పురస్కరించుకుని తిరునాళ్ల వైభవంగా జరగనుంది. ఇప్పటికే తిరునాళ్ళ నిర్వహణకు ఆలయాన్ని రంగులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

తేనెకన్నా తీయనైనది మాతృభాష



రేపల్లె రూరల్: తేనెకన్నా తియ్యనైనది మాతృభాష అని మదర్ థెరిసా మహిళా యునెస్కో క్లబ్ డైరెక్టర్ దాసరి ఝాన్సీలక్ష్మి అన్నారు. పట్టణంలోని నేతాజీ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో మదర్ థెరిసా మహిళా యునెస్కో క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృ దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ మాతృభాషను గౌరవించాలన్నారు. ప్రస్తుత కాలంలో యువత ఇతర భాషల మోజులో పడి మాతృభాషను మరిచిపోతున్నారని అన్నారు. సొంత భాషపై పట్టు సాధిస్తే ఏ భాషనైనా అలవోకగా నేర్చుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా 5, 8వ తరగతి విద్యార్థులకు పద్యాలు, గేయాల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ప్రజాభిమానమే విలువైన సంపద

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీ మోపిదేవి, డాక్టర్ ఈవూరి

చెరుకుపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందజేస్తూ ప్రజాభిమానాన్ని పొందుతున్న గొప్ప వ్యవస్థ వలంటీర్ల వ్యవస్థ అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. మండలంలో 294 వలంటీర్లలో ఐదుగురికి సేవారత్న, ఇద్దరికి సేవా వజ్ర, 287 మందికి సేవా మిత్ర పురస్కారాలను ఎంపీ మోపిదేవి, రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ మండల నాయకులతో కలసి ప్రదానం చేశారు. అనంతరం ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక వలంటీర్ వ్యవస్థ అని, ఈ వ్యవస్థ నేడు దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్న వలంటీర్లు ప్రతి గ్రామంలో ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అడ్డగోలుగా జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి పథకాన్ని అవినీతి మయం చేస్తూ ప్రజలను దోచుకున్నారని విమర్శించారు. జన్మభూమి కమిటీల ఫలితంగా గత ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు దిమ్మతిరిగే షాక్ ఇచ్చి ఇంటికి సాగనంపారని గుర్తు చేశారు. వలంటీర్లు ప్రతి కుటుంబంలోని అవ్వా తాతలకు వేకువ జామునే తలుపు తట్టి పింఛన్ నగదు అందిస్తూ ఆ కుటుంబ బిడ్డలుగా వారితో మమేకమయ్యారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలంటే వలంటీర్లు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరిస్తూ సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో బాపూడా చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, మండల జెడ్పీటీసీ సభ్యురాలు మరివాడ వెంకట పావని, వైస్ ఎంపీపీలు పైనం రంగారెడ్డి, కొత్తపల్లి సుమలత, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కమినేని కోటేశ్వరరావు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చీరాల వెంటేశ్వరరెడ్డి, వైసీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు దగ్గుమల్లి వంశీ, ఎంపీడీవో శ్రీనివాస మూర్తి, డీఎల్‌పీవో తాతా శివశంకరరావు, ఈవోపీఆర్డీ ఈవూరి విజయ్‌బాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికే తొలి ప్రాధాన్యం



సీసీ రహదారిని ప్రారంభిస్తున్న ఎంపీ మోపిదేవి, డాక్టర్ ఈవూరి గణేష్ తదితరులు

రేపల్లె రూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, ఉపాధిహామీ నిధులు రూ.19 లక్షలతో మండలంలోని పేటేరు గ్రామంలో నిర్మించిన నాలుగు సీసీ రహదారులను బుధవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండలంలో ఏకైక మేజర్ పంచాయతీ పేటేరును గత ప్రభుత్వాలకు భిన్నంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామంలో సచివాలయంతో పాటు నాడు–నేడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. పంచాయతీలో అవసరాలకు అనుగుణంగా సీసీ రహదారులు, డ్రెయిన్‌లు నిర్మించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కనపర్తి వసుమతి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావు ప్రభాకరరావు, గ్రామపార్టీ ఇన్‌చార్జ్ రవికిరణ్, ఎంపీడీవో శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శం

- వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి
- భట్టిప్రోలులో వలంటీర్లకు సత్కారం



భట్టిప్రోలులో వలంటీర్లను సత్కరిస్తున్న వరికూటి అశోక్‌బాబు

భట్టిప్రోలు: వలంటీర్ల సేవలు అద్భుతమని, ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులుగా మారారని వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు కొనియాడారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సేవా రత్న, మిత్ర, వజ్ర అవార్డులు అందుకున్న వలంటీర్లను బుధవారం ఘనంగా సత్కరించారు. భట్టిప్రోలు మార్కెట్ యార్డ్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీడీవో జేబీవీ మల్లిఖార్జునరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ అర్హత ఉంటే చాలు... ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలను నేరుగా అందించేందుకు సచివాలయం–వలంటీర్ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్ ప్రవేశ పెట్టారన్నారు. ప్రజల కష్ట సుఖాల్లో తోడుగా ఉంటున్న ఈ వ్యవస్థను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రానున్న రోజుల్లో మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. ఈ నాలుగున్నరేళ్ల పాలనలో రూ.2.57 లక్షల కోట్ల సంక్షేమ పథకాల నగదును సీఎం జగన్ వలంటీర్ల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందచేశారన్నారు. ఐలవరం–1కు చెందిన గోలి హైమావతికి సేవావజ్ర కింద రూ.45 వేలు నగదు, కంభం రజని (భట్టిప్రోలు–2), డొకుపర్తి సంధ్య (ఐలవరం–2), షేక్ రేష్మ (ఐలవరం–1), టి. వెంకటేశ్వరరావు (కోనేటిపురం), వి. నాగమణి (ఓలేరు)లకు రూ.30 వేలు చొప్పున నగదుతోపాటు 253 మందికి సేవామిత్ర కింద రూ.15 వేలు నగదు పురస్కారాలు అందజేశారు. తొలుత రూ.14 లక్షల వ్యయంతో ఆధునీకరించిన స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని అశోక్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూ రి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఉప సర్పంచ్ బుర్లె రామప్రసాద్, వైఎస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, కోఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల నేతలు దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజి, దారా చెన్నయ్య, పడమటి శ్రీనివాసరావు, గోవర్ధనగిరి చినబుజ్జి, జంపని మునిలక్ష్మి, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థతో ఎనలేని బలం



కొల్లూరులో సేవావజ్ర పొందిన వలంటీరును సత్కరిస్తున్న అశోక్‌బాబు

కొల్లూరు : నాయకులకు వలంటీరు వ్యవస్థ రూపంలో ఎనలేని బలం చేకూరిందని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. బుధవారం కొల్లూరు మండల పరిషత్తు కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో అమలులోకి తీసుకువచ్చిన వలంటీరు, సచివాలయ వ్యవస్థలు ఎన్నో సంస్కరణలకు మూల స్థంబాలుగా నిలిచాయన్నారు. వలంటీరు వ్యవస్థ కారణంగా ప్రజా ప్రతినిధులు, నాయకుల ప్రాభవం తగ్గిందన్న అపోహలను దరిచేరనివ్వరాదని, వలంటీరు వ్యవస్థ వృక్షాల వేరుల్లా సమాజంలో చొచ్చుకొనిపోయి నాయకులకు బలంగా మారిందన్నారు. ప్రజా ప్రతినిధులు సైతం వలంటీర్ల నుంచి ఎప్పటికప్పుడు వారి పరిధిలోని కుటుంబాలకు పథకాలు అందుతున్నదీ లేనిదీ సమాచారం తెలుసుకుని వలంటీర్ల పరిధిలో ఆయా సమస్యలు పరిష్కారమయ్యేలా దిశానిర్దేశం చేయాలన్నారు. అనంతరం సేవావజ్రకు ఎంపికైన క్రాపకు చెందిన షేక్ తిరుపతమ్మ, ఈర్ల తిరుపతమ్మలతో పాటు పలు సచివాలయాల పరిధిలో అవార్డులకు ఎంపికైన వలంటీర్లను శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ, వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ ఉప్పు శిరీష, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఈపూరు, గాజుల్లంక సొసైటీ చైర్మన్లు సూర్యదేవర రామకృష్ణ, తూము నాగేశ్వరరావు, ఎంపీడీఓ లక్ష్మికుమారి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు గుంటూరు నీలాంబరం, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

వివాదాస్పద పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలి



నాయకులతో చర్చిస్తున్న ఆర్డీవో హెలా షారోన్

రేపల్లె రూరల్: వివాదాస్పద పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా కేంద్రాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఎన్నికలు నిర్వహించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ రెవెన్యూ డివిజనల్ అధికారి హెలా షారోన్‌ను కోరారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో మణిలాల్ పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే పలుమార్లు జరిగిన సమావేశంలో వివాదస్పద పోలింగ్ కేంద్రాల అంశాలను సమావేశం దృష్టికి తీసుకురావటం జరిగిందని, అధికారులు ఈ అంశాన్ని కేవలం కాగితాలకు పరిమితం చేయకుండా దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటర్ల జాబితాను మరోమారు అధికారులతో పునః పరిశీలన చేయించి జాబితాలోని తప్పొప్పులను సరిచేయాలని చెప్పారు. స్పందించిన ఆర్డీవో షారోన్ మాట్లాడుతూ సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించటం జరిగిందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సమస్యాత్మక కేంద్రాలలో లైవ్‌వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ నిర్వహిస్తామన్నారు. గత ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడిన వారిని గుర్తించి బైండోవర్ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించామన్నారు. ఓటర్ల జాబితాలోని వివరాలను బీఎల్వోలతో నిరంతరం పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఆయా పార్టీల ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను, సలహాలను పరిశీలించటం జరుగుతుందన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో రోడ్డు విస్తరణ పనులు



మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ

బాపట్ల: రోడ్డు విస్తరణలో ఆర్యవైశ్యులందరం కలిసి సహకరించామని ఆ సంఘం బాపట్ల అధ్యక్షులు కొత్తమాసు సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కోన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రోడ్డు విస్తరణలో ఎమ్మెల్యే కోన రఘుపతికి డబ్బులు ముట్టజెప్పామనే ఆరోపణలో వాస్తవం లేదన్నారు.కోనపై ఆరోపణలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని కొత్తమాసు పేర్కొన్నారు. 100 అడుగులతో రోడ్డు విస్తరణ చేస్తున్నారని తెలుసుకుని తామంతా వెళ్లి 50 అడుగులతో రోడ్డు వేయాలని కోరటం జరిగిందన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి 80 అడుగులతో రోడ్డు వేసేందుకు ఉన్నతాధికారుతో మాట్లాడుతానని చెప్పారన్నారు. చిరు వ్యాపారులు ఉపాధిని కోల్పోకూడదనే మంచి మనసుతో వ్యాపారులకు న్యాయం చేసేందుకు ఎమ్మెల్యే కోన రఘుపతి 67అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ అనుమతికి సహకరించారని చెప్పారు. బాపట్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు, రథం బజారు రోడ్డు, సూర్యలంక రోడ్డు విస్తరణలు ఎమ్మెల్యే కోన రఘుపతితోనే సాధ్యమైందన్నారు.ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు నామా వేణుగోపాల్, పారేపల్లి వెంకట సురేష్, కోళ్ళపూడి మణిసాయికృష్ణ, ఏలూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు.. ఆధునిక దేవాలయాలు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపీ మోపిదేవి, పక్కన డాక్టర్ ఈవూరి గణేష్

రేపల్లె రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాలు ఆధునిక దేవాలయాల వంటివని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండలంలోని కారుమూరు గ్రామంలో రూ.35 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్‌తో కలిసి బుధవారం సాయంత్రం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ సేవలను గ్రామీణ ప్రాంతాలలో ప్రజల చెంతకు చేర్చేందుకు సచివాలయ వ్యవస్థను జగనన్న ప్రవేశ పెట్టారన్నారు. సచివాలయ కేంద్రాల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంత ప్రజలు సుదూరంలోని పట్టణంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితులు పోయాయన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భావించి గ్రామాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. గ్రామాలలో ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ ఏర్పాటు చేసి గ్రామాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గరికపాటి భానుకోటి, రామాయణం రత్తయ్య, యెడం సునీల్, మేడికొండ సుధాకర చంద్రహాసరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా సుదర్శన హోమం



హోమంలో పాల్గొన్న కోన రమాదేవి, భక్తులు

బాపట్ల అర్బన్: భీష్మ ఏకాదశి సందర్భంగా శ్రీ లలితా త్రిపుర సుందరీ పీఠం ఆధ్వర్యంలో బాపట్ల చీలురోడ్‌లోని శ్రీ పాండురంగస్వామి దేవాలయ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి తులసీదళ సహిత పుష్పార్చన, మహిళలతో ఉచిత సామూహిక దీప లక్ష్మీపూజ నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీ సుదర్శన హోమం జరిపారు. ఉచిత సామూహిక దీపలక్ష్మీ పూజలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. శాసన సభ్యులు కోన రఘుపతి సతీమణి కోన రమాదేవి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో రొంపిచర్ల కేశవాచార్యులు, మేడూరి వెంకట అప్పలాచార్యులు, శ్రీనివాసుల విఖనస మూర్తి, కొల్లిప ప్రసాద్ స్వామి, పరాశరం రఘురామ్, పంగులూరి కౌండిన్య శర్మ, ఆలయధర్మ కర్త మార్టూరి బదరీనారాయణ, జి.నీరజాదేవి పాల్గొన్నారని శ్రీ లలితా త్రిపుర సుందరీ పీఠ వ్యవస్థాపకులు నెమలికంటి హనుమంతరావు తెలిపారు.

ఏషియన్ చాంపియన్ షిప్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

నగరం: ఏషియన్ చాంపియన్ షిప్ పోటీలకు ఎస్వీఆర్‌ఎం కళాశాల విద్యార్థిని నాగిడి గాయత్రి ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్యచౌదరి చెప్పారు. కళాశాలలో బుధవారం విద్యార్థినికి జరిగిన అభినందన సభలో బుచ్చియ్య చౌదరి పాల్గొని మాట్లాడారు.మార్చి 5 నుంచి 9 వరకు థాయిలాండ్‌లో జరిగే 13వ ఏషియన్ చాంపియన్ షిప్ కానోస్లాలోమ్(వాటర్ స్పోర్ట్స్) పోటీలకు బీసీఏ మొదటి సంవత్సరం చదువుతున్న నాగిడి గాయత్రి ఎంపికైందన్నారు. కళాశాలనుంచి మొట్టమొదటి సారిగా ఇంటర్నేషనల్ ఈవెంట్‌లో ఇండియా తరుపున తరపున కళాశాల విద్యార్థిని ప్రాతినిధ్యం వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరికృష్ణ, పీజీ డైరెక్టర్ సురేంద్రబాబు, ఏం సుధాకర్, పీఈటీ సాంబమూర్తి పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన



ఈవీఎంల పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న భాస్కర్‌రెడ్డి

కర్లపాలెం: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మాష్టర్ ట్రైనర్, ఎంపీ రాజుపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. పెదగొల్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పని తీరుపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఈవీఎం బ్యాలెట్‌లో ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల పేర్లు, ఎన్నికల గుర్తులు ఉంటాయని చెప్పారు. ఓటరు ఓటు వేసిన అనంతరం వీవీప్యాట్‌లో ఓటు వేసిన సింబల్ తాలూకా గుర్తు 7 సెకండ్ల వరకు కనిపిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షణ్ముఖరావు, వీఆర్వో నాగరాజు, బీఎల్‌వోలు మాధురి, తదితరులు ఉన్నారు.

బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

చెరుకుపల్లి: విద్యార్థి దశ నుండే బాలికలు బాలల హక్కులు మరియు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షారోన్ ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ హోలియర్ వరల్డ్ స్కూల్ డైరెక్టర్ కర్రా శ్యామ్ బాబు అన్నారు. మండలంలోని గుళ్లపల్లి లోని హోలియర్ వరల్డ్ స్కూల్‌లో బాల బాలికలకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, బాలికల చట్టాలపై విద్యార్థులకు అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



మంటల్లో దగ్ధమవుతున్న పూరిల్లు

బాపట్లటౌన్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని ముత్తాయపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. ముత్తాయపాలెం గ్రామానికి చెందిన గవిని శివశంకర్ కు చెందిన పూరిల్లు మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతయ్యింది. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో ఇంట్లో నిద్రిస్తున్న భార్య పిల్లలు కట్టు బట్టలతో బయట పడ్డారు. ఇంట్లో దాచి ఉంచిన నగదు, బంగారు ఆభరణాలు, విలువైన ధృవ పత్రాలు అగ్నికి ఆహుతి కావడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

బాధితులకు అండగా ఉంటాం– ఎమ్మెల్యే

బాధితుడు గవిని శివశంకరరావు కుటుంబాన్ని బుధవారం ఉదయం ఎమ్మెల్యే కోన రఘుపతి పరిశీలించారు. బాధితులకు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటల పరిశీలనలో అధికారులు



పంటను పరిశీలిస్తున్న అధికారులు

పిట్టలవానిపాలెం: మండలంలోని మంతెనవారిపాలెం, పిట్టలవానిపాలెం గ్రామాలలో మినుము, వేరుశనగ పంటలను బాపట్ల ఏరువాక కేంద్రం అధికారులు బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ ప్రస్తుతం మినుము పైరులో తుప్పు తెగులు ఆశించిందని తెలిపారు.పైరు పూత దశలో ఈ తెగులు లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఈ తెగులు నివారణకు తెగులును తట్టుకునే రకాలు సాగు చేయాలన్నారు. మందులను పిచికారీ చేసినట్లైతే కొంత మేర పైరును కాపాడుకోవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్సీ వ్యవసాయాధికారి ఉమా మహేశ్వరి, మండల వ్యవసాయ విస్తరణాధికారి సుదర్శనరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు శివనాగేశ్వరి, రాజ్‌కుమార్, రైతులు ఉన్నారు.